# లూకా రచన

## క్రీస్తు, మనుష్యకుమారుడు

తరువాత మనం మూడవ సువార్త రచనను చేరబోతున్నాం. ఎన్నడూ లేనంత అమోఘంగా రాయబడిన పుస్తకంగా ఇది గణతకెక్కింది.

## లూకా రచనకు పరిచయం

**లేఖకుడు**

లూకా పుస్తకంలో రచయిత పేరు లేదు, కాని అది లూకాయేనని అనేకులు నమ్ముతారు, అతడు "ప్రియుడైన వైద్యుడు" (కొలస్సీ. 4:14).

లూకా సువార్తను వ్రాసిన లూకాయే కార్యగ్రంథం కూడా వ్రాశాడు (లూకా 1:1-4ను అపొ. 1:1తో పోల్చి చూడు). రెండు పుస్తకాలు ఒకే గ్రంథంలోని రచనలుగా చిత్రింపబడినట్టు విదితమౌతుంది.[1] కార్యగ్రంథం యొక్క రచయిత తరచుగా అపొస్తలుడైన పౌలుతో ప్రయాణం చేసినట్టు అది బయలుపరచుతుంది (అపొ. 16:10; 20:5; 21:1). లూకాను తప్ప పౌలుతో ప్రయాణం చేసిన సహచరులనందరిని తొలిగించవచ్చు.[2] వైద్యుడైన లూకా, లూకా సువార్తకును అపొస్తలుల కార్యగ్రంథానికిని రచయిత అనేదానితో తొలి (దైవ ప్రేరేపితము కాని) సంఘ పారంపర్యాలు ఏకీభవిస్తున్నాయి.[3]

లూకా ఎవరు? మనము అతనిని గ్రీకు పేరుతో ఎరుగుదుము.[4] అతడు జన్మనుబట్టి గ్రీసుదేశస్థుడైయుండవచ్చు (కొలస్సీ. 4:10, 11, 14లను చూడు). క్రొత్త నిబంధనకు రచనలు వ్రాసిన ఒకే అన్యజనుడు లూకాయై ఉంటాడు. అంతియొకయనందు మొదటిగా మారినవారిలో అతడు ఒకడై ఉండే అవకాశముంది.[5] అది అలాగైయున్నట్టయితే, సంఘారంభానికి పదిహేను సంవత్సరాలలోనే అతడు క్రైస్తవుడైయున్నాడని అర్థం.[6]

ముందుగా చెప్పినట్టే, లూకా వైద్యుడు (కొలస్సీ. 4:14). మరియు అతడు పౌలుతో ప్రయాణపు సహచరుడు. త్రోయను విడిచి ఫిలిప్పుకు వెళ్లడానికి (క్రీ.శ. రమారమి 51లో) "మేము" అనే మాట అపొ. 16 లేఖన భాగంలో ఆరంభమౌతుంది. పౌలు ఫిలిప్పీని విడిచి వెళ్ళినప్పుడు, లూకా అక్కడ నిలిచియుండి ఉండవచ్చు; ఎందుకంటె అక్కడ "మేము" అనే పదం ఆగిపోతుంది. పౌలు తిరిగి వచ్చేవరకు అతడు ఆ స్థానిక సంఘంలో పని చేసియుంటాడనేది విదితం. అప్పటినుండి మరల "మేము" అనే లేఖన భాగాలు ప్రారంభమౌతాయి; పాలస్తీనా ఓడరేవు పట్టణమైన కైసరయలో పౌలు ఖైదీగా చేయబడేవరకు లూకా పౌలుతో ప్రయాణాన్ని సాగిస్తాడు. పౌలు చెరసాలలో ఉన్న నాలుగు

సంవత్సరాల కాలం సమీపంలో ఉండియుండవచ్చు. పౌలు కైసరయనుండి రోముకు బయలుదేరే సమయంలో మరలా “మేము” అనే పదం తిరిగి కన్పిస్తుంది. (పాలస్తీనాలో ఉండగా, లూకా 1:1-4లో ప్రస్తావించబడిన పరిశోధనలో ఎక్కువ భాగం అతడు అక్కడ జరిగించి యుండవచ్చు.[7]) రోములో పౌలు “జతపనివారిలో” ఒకడుగా లూకా ఉన్నాడు (ఫిలేమోను 24). తరువాత, పౌలు చెరసాలలో వేయబడి, మరణంకొరకు ఎదురు చూస్తున్న దినాల్లో, లూకా అతనితో ఉన్నాడు (2 తిమోతి 4:11).

లూకా సుప్రసిద్ధమైన వ్యక్తి: విద్యావంతుడైన గ్రీసుదేశస్థుడు, పౌలు చేసే పనిలో జతగాడు, చురుకుగా పని చేసే సువార్తికుడును, మిషినెరీయునైయున్నాడు. లూకా సువార్త అపొస్తలుల కార్యాల రచయితగా, అతడు మొదటి గొప్ప చరిత్రకారుడుగాను, క్రైస్తవ్యానికి సాహిత్య సాక్షిగానూ ఉన్నాడు.

## రచనా కాలం

లూకా సువార్త రచనా కాలం రెండు దిశలుగా పరిమితమయింది. ఒకవైపు, ప్రభువైన యేసు మరణం తరువాత, లూకా మార్పు చెందడానికి మరికొంత కాలం పట్టింది - ప్రభువు జీవితాన్ని గూర్చి పలు విధములైన రచనలు ముందుగా రావడానికి చాలినంత కాలం ఉంది (లూకా 1:1). మరోవైపు, (దీనివెంట వచ్చిన) అపొస్తలుల కార్య గ్రంథం రోమా చెరలో మొదటి రెండు సంవత్సరాలు పౌలు ముగించిన అనంతరం, అంటే క్రీ.శ. 62 ప్రాంతంలో వ్రాయబడినట్టు తెలుస్తుంది (అపొ. 28:30). అనేకులైన కన్సర్వేటివ్ రచయితలు - లూకా క్రీ.శ. 60లో వ్రాయబడినట్టు చూపుతారు.[8]

## లూకా తొలి పలుకు

లూకా సువార్తకు చిత్రమైన ముందుమాట ఉంది:

> ఘనతవహించిన థెయొఫిలా, ఆరంభమునుండి కన్నులారా చూచి వాక్య సేవకులైనవారు మనకు అప్పగించిన ప్రకారము మనమధ్యను నెరవేరిన కార్యములను గూర్చి వివరముగా వ్రాయుటకు అనేకులు పూనుకొన్నారు గనుక నీకు ఉపదేశింపబడిన సంగతులు నిశ్చయముగా జరిగినవని నీవు తెలిసికొనుటకు వాటినన్నిటిని మొదటనుండి తరచి పరిష్కారముగా తెలిసికొనియున్న నేనును నీ పేరట వాటినిగూర్చి వరుసగా రచించుట యుక్తమని యెంచితిని (లూకా 1:1-4).[9]

ఈ పరిచయంనుండి కొన్ని ముఖ్యాంశాలను ఆలోచించుదాం:

“మనమధ్యను నెరవేరిన కార్యములను గూర్చి వివరముగా వ్రాయుటకు అనేకులు పూనుకున్నారు.” సంఘమంతటిలో ప్రభువైన యేసును గూర్చిన ప్రాథమిక విశ్వాస నియమం సమిష్టిగా ఉన్నట్టు దీనిని బట్టి విదితమైయుంది.

“ఆరంభమునుండి కన్నులారా చూచి వాక్య సేవకులైనవారు మనకు అప్పగించిన ప్రకారము”: “కన్నులారా చూచినవారు, వాక్య సేవకులైనవారు” అనే మాటలు ప్రాథమికంగా అపొస్తలులకు చెందినవైయుండవచ్చు (అపొ. 1:21, 22లను చూడు),

అయితే వారు విశ్వాస నియమావళికి ఏకత్వాన్ని సూచించేవారై ఉంటారు.

"... తరచి పరిష్కారముగా తెలిసికొనియున్న నేనును": క్రీస్తు జీవితాన్ని గూర్చి వ్రాసినవారిలో కొందరు తరచి పరిష్కారంగా తెలిసికోలేదనే ఆలోచన స్ఫురిస్తుంది.[10] క్రీస్తు జీవితాన్ని గూర్చి చిత్రించిన రచనలలో దైవ ప్రేరేపితులు కాని పలు ఆరంభ ప్రతులు నేటికిని ఉన్నాయి. అయితే అవి నిరర్థకమైనవాటితో కూడి ఉన్నాయి.

"... ఆరంభమునుండి": సంఘ చరిత్ర ఆరంభంనుండి "కన్నులారా చూచినవారితో" లూకా సంబంధం పెట్టుకొనియున్నట్టున్నాడు.

"... నీ పేరట వాటిని వరుసగా రచించుట": ఇతర సువార్త రచయితలకంటెను లూకా క్రీస్తు జీవితాన్ని చరిత్ర క్రమంలో వ్రాయడానికి ఉద్దేశ పూర్వకంగా ప్రయాసపడినట్టు యిది సూచింపవచ్చు. ఏదియెలాగున్నా, లూకా సువార్త కూడా మొదటినుండి చివరివరకు చరిత్ర కాలక్రమంలో లేనట్టు మనం కనుగొంటాం. "వరుసగా రచించుట" అనేది, క్రమబద్ధమైన విధానంలో లాజికల్‌గా ఆలోచింపబడిన విధానంలో – వ్రాయడాన్ని అది సూచింపవచ్చు.

"... ఘనతవహించిన థెయొఫిలా": అధికారిని సంబోధించినప్పుడు "ఘనత వహించిన" అని అంటారు. "థెయొఫిలా" అనే గ్రీకు పదానికి "దేవుని ప్రేమించువాడు" అని అర్థం. దేవుని ప్రేమించే ప్రతివానిని అది సూచింపవచ్చు. అయితే ప్రత్యేకించి అది ఒక వ్యక్తికి సంబంధించి కూడా అయ్యుండవచ్చు. ఈ వ్యక్తి లూకాను పోషించినవాడు, పుస్తక ప్రచురణకు ఆర్థిక సహాయము చేసినవాడు కావచ్చు.[11]

"... నీకు ఉపదేశింపబడిన సంగతులు నిశ్చయముగా జరిగినవని నీవు తెలిసి కొనునట్లు": "నీకు ఉపదేశింపబడిన సంగతులు" గత ఉపదేశానికి సంబంధించినవన్నట్టు కొందరు తలంచారు. అది ఏమైనా సరే, ఆది సంఘంలో ఉమ్మడిగా విశ్వాస నియమం ఉన్నట్టు ఈ మాటలు నొక్కి పలుకుతున్నాయి.

క్రైస్తవ్యం యొక్క మొదటి మామూలు "విమర్శకుడు"గా లూకా ఉన్నట్టు తలంచవచ్చు: ప్రచారంలో ఉన్న ఆయా వివరణలను అతడు అంగీకరింపలేదు. అయితే అతడు వాస్తవాలను తరచి పరిష్కారంగా తెలిసికొన్నాడు. ఆ విధంగా, అతడు వ్రాసింది "ఖచ్చితమైనది." తన వివరణను తనికీ చేసికోవచ్చునని, నిజమని నిరూపించుకొనడానికి గాను తాను చారిత్రక సమాచారాన్ని యిచ్చాడు (1:5; 2:1, 2; 3:1; 13:1, 2లను చూడు). లూకా హెచ్చు తగ్గులు లేని చరిత్రకారుడని పురావస్తు శాస్త్ర పరిశోధనలు స్థాపించుతూ, క్రీస్తు జీవితానికి, ఆది సంఘ చరిత్రకును అతని మాటలు ఎక్కువ విలువనిస్తున్నాయి.

### రచనకు ప్రత్యేకమైన మూలం

లూకా ఉపయోగించిన ఆధారాలకు సంబంధించి, అపొస్తలుడైన పౌలుతో అతనికున్న సంబంధానికి ప్రత్యేకమైన గుర్తింపు యివ్వాలి. ఆది సంఘములో కీలకమైన యిద్దరు వ్యక్తులు పేతురు, పౌలు అని సాధారణంగానే అంగీకరించబడుతుంది. అందును బట్టి, ప్రభువైన యేసు జీవితం, బోధలు అనేవాటిని దాఖలు చేసే ముఖ్యమైన పనిలో, వారి

ప్రాబల్యం లేకుండ జరిగియుండదని మనం ఊహిస్తాం. (దైవ ప్రేరేపితం కాని) పారంపర్యాలు నిజమైతే, రెండింటికి సంబంధం లేక భాగముంది: మార్కు రచనపై పాఠమందు ముందుగా ప్రస్తావించినట్టే, మార్కు పేతురు ప్రకారమైన సువార్తగా నమ్మబడింది. అదేవిధంగా, పౌలు ప్రకారమైన సువార్తను లూకా దాఖలు చేసినట్టు, ఆరంభ పారంపర్యాలు అంటున్నాయి.

ఆయన భూనివాస పరిచర్య కాలంలో, ప్రభువైన యేసు శిష్యుడుగా పౌలు లేడు; కాని, క్రీస్తు జీవితాన్ని గూర్చిన ప్రాథమిక సమాచారాన్ని పౌలు ప్రత్యక్షతవలన పొందాడు (1 కొరింథీ. 11:23; 15:3–8; అపో. 20:35). యేసును గూర్చిన గొప్ప సందేశాలను పౌలు మాట్లాడుతూ ఉండగా, లూకా వినియుండవచ్చు.

అంటే, పౌలు యిచ్చిన సమాచారం మీదనే లూకా సంపూర్ణంగా ఆధారపడ్డాడని దాని అర్థం కాదు. అతడు దానితో తన సొంత పరిశోధనను చేర్చాడు.[12] ఏది కాకపోయినా, పౌలు సువార్తను లూకా దాఖలు చేశాడన్న విషయాన్ని దైవ ప్రేరేపితము కాని ప్రాచీన రచయితలు ఏకాభిప్రాయం కలిగియున్నారు. అన్యజనులైన పాఠకులకు, అందులో ప్రత్యేకించి, గ్రీకు భాష మాట్లాడేవారికి ఈ రచన వ్రాయబడిందనే వాస్తవానికి యిది యింకను ప్రాముఖ్యతను చేర్చుతుంది.[13] పౌలు అన్యజనులకు అపొస్తలుడు (అపో. 26:16–18). గ్రీసుదేశస్థులకు సువార్తను తొలిగా ప్రకటించినవాడు అతడే అయ్యుండవచ్చు (అపో. 17).

**రచన నొక్కి పలికిన విషయాలు**

లూకా తన రచనను అన్యజనుల దిశగా నడిపించాడు. కొండమీద ప్రసంగాన్ని (లేక ఆలాటిదాన్ని) గూర్చి అతడు సమాచారాన్ని యిచ్చినప్పుడు, "ధర్మశాస్త్రము, ప్రవక్తలను" అతడు ప్రస్తావించలేదు. ప్రత్యేకించి యూదులకు సంబంధించిన "రబ్బీ," "హోసన్నా" అనే పదాలను అతడు తప్పించివేశాడు. పాలస్తీనా యొక్క భూగోళాన్ని వివరించడానికి అతడు జాగ్రత్త తీసుకున్నాడు. "కల్వరి" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదాన్ని ఉపయోగించిన సువార్త రచయిత అతడు ఒక్కడే. అతని ప్రత్యేకమైన గురి గ్రీకు భాష మాట్లాడేవారేయని సాధారణంగా అంగీకరింపబడుతుంది. (లూకా గ్రీసు దేశీయుడే అయ్యుండవచ్చుననే విషయం మరియు గ్రీకు అధికారికి అతని రచనలు సంబోధింప బడ్డాయనే సంగతి ముందుగానే చెప్పబడింది.)

లూకా కాలంలోని గ్రీసుదేశస్థులు విద్యావంతులు, సౌందర్యాన్ని, కళలను ప్రేమించిన వారు. లూకా రచనకు వేరైన సాహిత్యపు గుణ లక్షణముండడంలో ఆశ్చర్యం లేదు. అది సంపూర్ణమైనది, క్రమమైనది, ప్రామాణికమైనది. మానవ రక్షణకు దానికున్న సంబంధానికి వేరుగా కూడా, అది మిక్కిలి సొగసైన రచన. లూకా కళాకారుడైయున్నట్టు ఆది పారంపర్యం అంటుంది. కిత్తినార గుడ్డపై అతడు ఎప్పుడైనా చిత్రాలు వేశాడో లేదో కాని. మాటలతో అతడు వింతగొలుపు చిత్రకారుడు. 1, 2 అధ్యాయాలలో లూకాచే మాత్రమే దాఖలు చేయబడిన రమ్యమైన నాలుగు, పద్య గీతాలను చదువు. తప్పిపోయిన కుమారుని వంటి కదిలించే కథను 15వ అధ్యాయంలో చవిచూడు. లూకా వర్ణన యొక్క మాదిరులు సరళమైనవి, ముఖ్యమైనవి.

పరిపూర్ణమైన మానవత్వాన్ని గ్రీసుదేశస్థులు అభిమానిస్తారు. పరిపూర్ణమైన మానవత్వాన్ని వారు ఎంతగా అభిమానిస్తారంటే, వారు తమ దేవతలను మానవ రూపంలోనే చిత్రించుకుంటారు. ఈలాటి మానసిక స్థితిగలవారికి, ప్రభువైన యేసును, పరిపూర్ణమైన మనుష్య కుమారునిగా లూకా ప్రదర్శించాడు. లూకా సువార్తలో యేసు మానవత్వం ప్రాధాన్యతను చేకూర్చుకుంది. దీనికి యిక్కడ కొన్ని ఉదాహరణలు ఉన్నాయి:

- మానవ చరిత్రలో పాలుపొందినవానిగా యేసును గూర్చిన లూకా చారిత్రక సూచనలు చూపుతాయి.
- లూకా వంశావళి (లూకా 3) మత్తయి వంశావళి (మత్తయి 1) వేరుగా ఉంటుంది. యోసేపు ద్వారా ప్రభువు చట్టబద్ధమైన క్రమాన్ని మత్తయి యిచ్చిన వంశావళి నొక్కి పలుకుతుంది. మరియ ద్వారా – ప్రభువు శరీర సంబంధమైన క్రమాన్ని లూకా యిచ్చిన వంశావళి నొక్కి పలుకుతూ – కడకు ఆదాము వద్దకు అది కొనిపోతుంది. ఈ విధంగా ప్రజలందరి మానవత్వంలో ప్రభువు పాల్గొన్నట్టు లూకా చూపాడు.
- ప్రభువైన యేసు జన్మను లూకా మాత్రమే దాఖలు చేశాడు (లూకా 2). వివరాలు ఆయన మానవత్వాన్ని నొక్కి పలుకుతాయి. ఆయన తల్లిదండ్రులు పన్ను విధింపబడడానికి బేత్లెహేముకు వెళ్లారు (తక్కిన వారివలెనే). ప్రభువు దీన స్థితిలో పశువుల పాకలో జన్మించారు. ఆయనను తొలిగా దర్శించినవారు గొర్రెల కాపరులు.[14]
- ప్రభువు భూనివాస జీవితాన్ని గూర్చి లూకా మాత్రమే తెలియజేశాడు. ఆయన వర్ధిల్లిన తీరు ఖ్యాతికెక్కినది కాని అసాధారణమైనది కాదు. ఇతరులు ఎదిగినట్టే ఆయన కూడా ఎదిగాడు (2:40, 52).
- ఇతరులు బాప్తిస్మం పొందుతున్నప్పుడే ప్రభువు కూడా బాప్తిస్మం పొందినట్టు లూకా నొక్కి చెప్పాడు (3:21).
- ప్రభువు శోధింపబడినప్పుడు (4:1–13), మానవ జాతి సకల శోధనలను అనుభవించు ప్రతినిధిగా ఆయన శోధనలనెదుర్కొన్నాడు.
- ఆయన పరిచర్య అంతటిలో, ఆయన మానవత్వం నొక్కి చెప్పబడింది: ఆయన కన్నీళ్లు విడిచాడు (19:41); ఆయన ప్రార్థించాడు (3:21; 5:16; 6:12); ఆయన కనికరపడ్డాడు (7:13; 10:33; 15:20); ఆయన మరణించాడు (23:46).

లూకా ప్రభువైన యేసును కేవలం నరుడని మాత్రమే వర్ణించాడని దీని భావం కాదు. యేసు పరిపూర్ణుడైన నరుడు; ఆయన దైవ–మానవుడు; ఆయన రక్షకుడు. జన్మలో మనం నిర్దోషులం, అయితే ఆయన పరిశుద్ధుడు (లూకా 1:35). యేసునందు పరిశుద్ధాత్మ పనిని లూకా సువార్త నొక్కి చెప్పుతుంది.[15] మత్తయి, మార్కుల్లో కలిపిన దానికంటె పరిశుద్ధాత్మను గూర్చిన ఎక్కువైన లేఖన భాగాలు లూకాలో ఉన్నాయి.

## రచనలోని విశేష లక్షణాలు

దీని విశేష లక్షణాల్లో ఎక్కువ భాగం ముందుగా చర్చించినవాటికి సంబంధించినవే. లూకా రచన వైద్యాంశాలపై ప్రత్యేకమైన మొగ్గు చూపుతుంది. వైద్యుని మనో భావనలను లూకా వివరణ తరచుగా ప్రదర్శిస్తుంది. అతడు కొన్నిసార్లు వైద్య పదాలను ఉపయోగించాడు. (18:25లో శస్త్ర చికిత్సకు సంబంధించిన సూదికి గ్రీకు పదాన్ని అతడు ఉపయోగించాడు). ఆయన "చెమట రక్త బిందువులవలె" కారినట్టు లూకా మాత్రమే దాఖలు చేశాడు (లూకా 22:44). పన్నెండు సంవత్సరాలుగా రక్త స్రావ రోగంగల స్త్రీని గూర్చి లూకా తెలిపినప్పుడు, మార్కు కంటె ఎక్కువ సానుభూతిని అతడు వైద్యులపట్ల కనుపరచాడు (మార్కు 5:25, 26ను లూకా 8:43తో పోల్చి చూడు).

క్రీస్తు కన్య గర్భపు జన్మను, స్వస్థపరచే అద్భుతాలను (లేక అద్భుత స్వస్థతలను), యేసు నిజంగా మరణించిన వాస్తవాన్ని, ఆయన శరీర పునరుత్థానాన్ని ఒక వైద్యుడు స్థిరపరచినందుకు వ్యక్తిగతంగా నేను సంతోషిస్తున్నాను.

క్రీస్తు జీవితపు రికార్డుగా లూకా విస్తరించి తెలిపింది. చెప్పగలిగిన యావత్తు ఏ రికార్డు లేక రచన చెప్పలేదు (యోహాను 21:25), కాని, లూకా సువార్త రచన మాత్రం క్రీస్తు జీవితానికి ఎక్కువ ప్రాతినిధ్యం యిస్తుంది. సువార్త రచనల్లో యిది పెద్దది.[16]

మిగిలిన సినాప్టిక్ రచనల కంటెను యిది ఎక్కువ విశేషమైన సమాచారాన్ని కలిగియుంది. ముందుగా గమనించినట్టే, క్రీస్తు జననము, బాల్యము అనేవాటిని లూకా రికార్డు చేసింది. 9:51నుండి 18:30వరకు, అక్కడక్కడ కొన్ని పేరాలు మినహాయించి, లూకాలోని విషయం ప్రత్యేకమైనది. ఎమ్మాయికి వెళ్లే శిష్యులకు ప్రభువు ప్రత్యక్షమవ్వడం (24:13–35) మరియు ఆయన ఆరోహణమవ్వడం అనే వివరాలు లూకా మాత్రమే యిచ్చాడు (24:50–53; అపొ. 1:9–11లను కూడా చూడు).

లూకా రచన ప్రార్థనను గురించి ఎక్కువగా నొక్కి చెప్పుతుంది. యేసు జీవితంలోని ప్రధాన ఘట్టాలలో ఆయన ప్రార్థించినట్టు ఈ రచన చూపుతుంది (3:21; 6:12, 13; 9:18, 28, 29).

బలహీనులు, అవసరతలో ఉండేవారు, తృణీకరింపబడినవారిపై, లూకా తన రచనలో ప్రత్యేకమైన శ్రద్ధను చూపాడు. అనేక సంధింపులలో స్త్రీలు చూపించబడ్డారు. (అధ్యాయాలు 1, 2ల్లో మరియ, ఎలీసబెతులపై నొక్కి చెప్పడం, నాయీను విధవరాలు, 7వ అధ్యాయంలో పాపాత్మురాలైన స్త్రీని గమనించు). అనుకూలమైన వెలుగులో సాంఘీకంగా వెలివేయబడిన వారు మంచి సమరయుడు [10:30–37], తప్పిపోయిన కుమారుడు [15:11–32], దీనులైన సుంకరులు [18:13, 14], జెక్కయ్య [19:2–10), సిలువ మీద దొంగ [23:43] చూపించబడ్డారు. ప్రభువైన యేసు "సుంకరులకును పాపులకును స్నేహితుడు!" (లూకా 7:34).

## రచనోద్దేశం

లూకా "రక్షణ సువార్త"యని, "పాపికి రక్షణ"యని వ్యాఖ్యానకర్తలు దీన్ని పిలిచారు.

ఈ సినాప్టిక్ సువార్త రచన మాత్రమే యేసును “రక్షకుడని” పిలిచింది (లూకా 2:11). ఈ రచనలో ప్రాముఖ్యమైన లేక కీలకమైన భాగం 19:10: “నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను.”

### పుస్తక విభాగాలు

లూకా సువార్త సహజంగా నాలుగు భాగాలుగా విభజింపబడింది: (1) క్రీస్తు ఆరంభ జీవితం, (2) ఆయన పరిచర్య, (3) ఆయన మరణాన్ని చుట్టుకున్న పరిస్థితులు, మరియు (4) ఆయన పునరుత్థానం. రెండవ విభజన – ఆయన పరిచర్య కూడా రెండు వేరు భాగాలు కలిగియున్నది. ఇది అయిదు ప్రధాన విభాగాలను రేఖామాత్రంగా ఇస్తుంది.

ప్రభువు పరిచర్యలోని తొలి భాగం నొక్కి చెప్పడం 4:14నుండి 9:50వరకు కొంత ఉపదేశం ఇచ్చినా ముఖ్యంగా ఆయన కార్యాలు, చేసిన అద్భుతాలను గురించే చెప్తుంది. ఈ భాగము గలిలయలో ఆయన పరిచర్యను గూర్చి తెలుపుతుంది. ఇందులో ఎక్కువ సమాచారం ఇతర సినాప్టిక్ సువార్త రచనలను పోలియుంటుంది.

రెండవ భాగం, 9:51నుండి 18:30వరకు, ప్రత్యేకించి లూకాకు చెందినదే. (ఇందులో తక్కువ భాగం యితర సువార్త రచనల్లో కన్పిస్తుంది). ఈ భాగం “ఆయన యెరూషలేమునకు వెళ్లుటకు మనస్సు స్థిరపరచుకొని”న సంగతిని సూచిస్తుంది (9:51 చూడు). దీనిని యూదయ – పెరియ పరిచర్యయని సాధారణంగా పిలువబడుతుంది. అద్భుతాలు కార్యకలాపాలు ఈ అధ్యాయాల్లో వర్ణింపబడ్డాయి. కాని ప్రధానంగా నొక్కి పలికింది ఆయన ఉపదేశం మీద. ఉపదేశము, అద్భుతాలనేవి యిష్టం వచ్చినట్టు సేకరించబడ్డాయన్నట్టు, తొలి చూపులో కన్పిస్తాయి. కాని అన్యజనులైన తన పాఠకులకు ప్రభువైన యేసు పనియందలి భావాన్ని వివరించడానికి గాను లూకా సరిక్రొత్త సమాచారాన్ని ఉపయోగించాడు.

---

సూచనలు

[1]సైజును బట్టి ఆలోచిస్తే, క్రొత్త నిబంధనకు ఎక్కువగా లూకా సువార్త, అపొస్తలుల కార్యాల రచయిత కాంట్రిబ్యూట్ చేశాడు. [2]తొలిగించే ఈ విధానం మెర్రిల్ సి. టెన్నీ, *New Testament Survey* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1961), 173లో చర్చింపబడింది. [3]లూకా, అపొస్తలుల కార్యాల రచయితను గూర్చిన వివరాలకు “కార్యగ్రంథం భాగం 1,” ట్రూత్ ఫర్ టుడే సంచికను చూడు. [4]లాటిన్‌లో అతని పేరుకు “వెలుగును తెచ్చువాడు” అని అర్థం. గ్రీకులో లూకా అనే ఉద్భవించిన చోటు అని కూడా సూచింపబడుతుంది: “లూకానియనుండి.” [5]తరువాత చేతి ప్రతులలో “మేము” అనేది అపొ. 11:28లో ఉంది. (Bruce Metzger, A Textual Commentary on the Greek New Testament, 3d ed. [New York: United Bible Societies, 1971], 344-45). [6]లూకా 1:1–4లోని లూకా పరిచయాన్ని బట్టి, లూకా వ్యక్తిగతంగా ప్రభువును ఎరుగలేదు, కాని “ఆరంభమునుండి” అనే మాటలను బట్టి సంఘ చరిత్రలోని ఆరంభ కాలంలో అతడు క్రైస్తవుడైనట్టున్నాడు. [7]దైవప్రేరేపితం కాని పారంపర్యం ప్రకారం, ప్రభువు యొక్క ఆరంభ కాలాన్ని గూర్చిన అతని సమాచారానికి ప్రభువు తల్లియైన మరియ ప్రాథమిక మూలమైయుంది. [8]1 తిమోతి 5:18 (రమారమి క్రీ.శ. 65లో వ్రాయబడింది)లో, పౌలు మత్తయి 10:10నుండిగాని లూకా 10:7నుండిగాని

పౌలు కోట్ చేశాడు. [9]ఈ లేఖన భాగాన్ని అపో. 1:1తో పోల్చి చూడు. [10]ఈ ప్రతిపాదననుండి మత్తయి, మార్కు, యోహానులు మినహాయించబడ్డారు.

[11]"ప్రచురణ" – రచన యొక్క ప్రతులను చేసి, పంపిణీ చేయడాన్ని సూచిస్తుంది. [12]లూకా యొక్క పరిశోధనను పరిశుద్ధాత్మ నడిపించియుండవచ్చు. పరిశోధననుండి లూకా గడించిన సమాచారాన్ని ఉపయోగించడంలో పరిశుద్ధాత్మ తప్పక అతనిని నడిపించాడు. [13]తరువాత ఈ పాఠంలో పుస్తకం నొక్కి పలికినది చర్చించబడింది. [14]రాజును దర్శించ జ్ఞానులు వచ్చినట్టు మత్తయి నొక్కి పలుకగా, బాలుని చూడ గొర్రెల కాపరులు వచ్చినట్టు లూకా నొక్కి పలికాడు. [15]ఆత్మ యొక్క పనిమీద ఒత్తి పలకడం కార్యగ్రంథంలో కొనసాగింపబడింది. [16]లూకాకంటె మత్తయిలో అధ్యాయాలు ఎక్కువ ఉన్నా, మత్తయికంటె లూకాలోనే సమాచారం ఎక్కువగా ఉంది. NASB యొక్క నా ప్రతిలో – మత్తయి 30 పేజీలకంటె కొంచెం ఎక్కువగా ఉండగా, లూకా 32 పేజీలు ఉంది.

## లూకా సువార్త సంక్షిప్త వర్ణన

**I.** మనుష్య కుమారుని సిద్ధపాటు (1:1–4:13).

A. తొలి పలుకు (1:1–4).

B. జననము, బాల్యము.

1. బాప్తిస్మమిచ్చు యోహాను జన్మను గూర్చి జెకర్యాకు ప్రకటన (1:5–25).
2. ప్రభువు జన్మను గూర్చి మరియకు ప్రకటన (1:26–38).
3. మరియ ఎలీసబెతును దర్శించుట (1:39–56).
4. యోహాను జననము, ఆరంభ జీవితం (1:57–80).
5. యేసు జననము (2:1–7).
6. యేసు జననము గూర్చి కాపరులకు ప్రకటన (2:8–20).
7. యేసును దేవాలయంలో ప్రతిష్ఠించుట (2:21–39ఎ).

C. యేసును నజరేతుకు తెచ్చుట, చిన్ననాటి ఎదుగుదల (2:39బి, 40).

D. యేసు పన్నెండేండ్ల ప్రాయంలో దేవాలయాన్ని దర్శించడం (2:41–50).

E. నజరేతుకు తిరిగి వెళ్లి, యేసు ఎదుగుచుండెను (2:51, 52).

F. దాదాపు ఆయన 30 ఏండ్ల ఈడులో సువార్త ప్రారంభించడం (లూకా మాత్రమే ప్రభువు వయస్సును సూచిస్తున్నాడు (3:23).

1. యోహాను పరిచర్య (యోహాను బంధింపబడడం ప్రస్తావించబడింది) (3:1–20).
2. యేసు బాప్తిస్మము మరియు వంశావళి (3:21–38).
3. యేసు శోధింపబడడం (4:1–13).

G. మొదటి కాలంలో గుర్తుంచుకోవలసినవి:

1. బేత్లెహేములో జననము.
2. నజరేతులో బాల్యము.
3. యొర్దానులో బాప్తిస్మము.
4. చరిత్రలోని పూర్వ గాథ (వంశావళి).
5. సాతానుతో యుద్ధం (శోధన).

**II.** మనుష్య కుమారుని శక్తి (4:14–9:50).

A. పరిచర్య ఆరంభించబడింది.

1. గలిలయకు: ప్రభువు సువార్త ప్రకటన ఆరంభం (4:14, 15).
2. నజరేతు వద్ద తొలి తిరస్కారం (4:16–30).
3. కపెర్నహోములో ప్రసంగం, స్వస్థత (4:31–41).
4. ఏర్పాటైన చోటుకి, తరువాత గలిలయ పర్యటన (4:42–44).

    5. అద్భుతంగా చేపలు పడడం - చేపలు పట్టేవారిని పిలుచుట 5:1-11).
    6. కుష్ఠరోగిని శుద్ధిచేసి, ఒంటరిగా ప్రార్థించ వెళ్లుట (5:12-16).
B. పరిచర్య విమర్శింపబడింది.
    1. పైకప్పుగుండా దింపబడిన వ్యక్తి (5:17-26).
    2. లేవీని పిలచుట, పాపులతో భుజించుట (5:27-32).
    3. ఉపవాసాన్ని గూర్చిన విమర్శ (5:33-39).
    4. సబ్బాతు విషయంలో విమర్శలు (6:1-11).
C. (హెచ్చింపబడిన వేగంతో) పరిచర్య కొనసాగింపబడింది.
    1. ప్రార్థన, తదుపరి పన్నిద్దరిని ఏర్పరచుకొనడం (6:12-16).
    2. మైదానంలో ప్రసంగం (6:17-49).
    3. కపెర్నహోము శతాధిపతి సేవకుని స్వస్థపరచుట (7:1-10).
    4. నాయీనుకు; విధవరాలి కుమారుని బ్రతికించడం (7:11-17).
    5. యోహానుకు, యోహానును గూర్చిన యేసు సాక్ష్యం (7:18-35).
    6. పరిసయ్యుడైన సీమోను యింట (7:36-50) (లూకాలో 41-43 వచనాలు విశేషమైనవి).
    7. గలిలయలో మరొక పర్యటన (8:1-3).
    8. ఉపమానాలు (విత్తువాడు, దీపము), యేసు నిజమైన బంధువులు (8:4-21).
    9. సముద్రాన్ని దాటుతూ తుఫానును నిమ్మళింపజేయుట (8:22-25).
    10. గెరాసేనుల దేశం, అపవిత్రాత్మ పట్టిన మనిషి (8:26-39).
    11. సముద్రాన్ని వెనుకకు దాటడం, యాయీరు కుమార్తెను బాగు చేయడం వగైరాలు (8:40-56).
D. పరిచర్య శిఖరాగ్రం చేరుకుంది.
    1. పన్నెండు మందిని పంపుట (హేరోదు దృష్టిని ఆకర్షించుట) (9:1-10ఎ).
    2. బేత్సయిదాకు సమీపాన అరణ్య ప్రదేశం, 5000 మందికి ఆహారం పెట్టుట (9:10బి-17).
    3. ప్రార్థన - గొప్ప ఒప్పుకోలు (9:18-22). శిష్యులు తమ సిలువను ఎత్తికొనవలసిందిగా సవాలు చేయబడ్డారు (9:23-27).
    4. రూపాంతరం (9:28-36).
    5. కొండ దిగి వచ్చుట; అపవిత్రాత్మగల బిడ్డ బాగుచేయబడడం; తన మరణాన్ని గూర్చి తన శిష్యులకు మరల చెప్పడం (9:37-45).
    6. గొప్పవాడైయుండడం ఏమో ఎరుగకుండు శిష్యులు (తమ్మును వెంబడించని వానిని శిక్షించాలనే వాంఛ) (9:46-50).

**III.** మనుష్య కుమారుని సువార్త ప్రకటన (9:51–18:30).

A. యేసు "యెరూషలేము వెళ్ల తీర్మానం గలవాడైయున్నాడు" (9:51 చూడు).

1. సమరయగుండా వెళ్లడం ("అగ్ని దిగి రమ్మని" పిలిచే సంఘటన) (9:51–56).
2. కాబోయే శిష్యులు (9:57–62).
3. డెబ్బది మందిని పంపుట (10:1–24).
4. ధర్మశాస్త్రోపదేశకుడు పరీక్షించుట – మంచి సమరయుని కథ (10:25–37).
5. బేతనియ వద్ద, మరియ "శ్రేష్ఠమైనది" కోరుకొనుట (10:38–42).
6. సాధారణ ఉపదేశం:
   - a. ప్రార్థన – ప్రార్థనపై సందేశం (11:1–13).
   - b. నిందమోపుట – దయ్యములపై, విధేయతపై బోధ, సూచనను కోరుట (11:14–36).
   - c. పరిసయ్యుని యింట భుజించుట – మత నాయకులకు అయ్యో (11:37–54).
   - d. జనసమూహాలు, సాధారణ ఉపదేశం (12:1–12).
   - e. పిత్రార్జితపు ప్రశ్న, బుద్ధిహీనుడగు ధనవంతుని కథ (12:13–21).
   - f. చింతించడం, పరలోకమందు ధనం, మెలకువగా ఉండడం, గృహనిర్వాహకత్వం (12:22–59).
   - g. చరిత్ర సూచన, మారుమనస్సును గూర్చిన బోధ (13:1–9).
7. బలహీనమైన స్త్రీకి స్వాస్థ్య మిచ్చుట – విమర్శ (13:10–17).
8. రాజ్యమును ఆవగింజకును, పులిపిండికిని పోల్చడం (13:18–21).

B. యేసు "యెరూషలేమునకు వెళ్లు మార్గంలో" బయలుదేరాడు (13:22).

1. రక్షింపబడువారు కొందరేఅన్నట్లు బోధించడం (13:23–30).
2. గలిలయలో, హేరోదును గూర్చి ప్రభువు హెచ్చరించాడు: యెరూషలేము వద్ద ఆయన మరణించాలనే ఆయన ప్రతిపాదన ("యెరూషలేమా, యెరూషలేమా"; 34 వ.) (13:31–35).
3. సబ్బాతు దినాన పరిసయ్యుని యింట భోజనం, జలోదర రోగిని బాగు చేయుట (14:1–6). పండుగలపై వరుస ఉపదేశాలు:
   - a. పెండ్లి విందులో అగ్ర పీఠములను గూర్చిన ఉపమానం (14:7–11).
   - b. కేవలం స్నేహితులను మాత్రమే ఆహ్వానించ వద్దని పాఠం (14:12–14).
   - c. గొప్ప విందును గూర్చిన ఉపమానం (14:15–24).

4. శిష్యుడై ఉండగోరేవాడు చెల్లించవలసిన వెల (14:25-35).
5. పాపులతో భుజించినందుకు విమర్శింపబడుట (15:1, 2). పరిసయ్యులకును సద్దూకయ్యులకును విరోధంగా వరుస పాఠాలు:
    a. పోగొట్టుకొన్నవాటిని గూర్చిన ఉపమానాలు (15:3-32).
    b. అన్యాయస్థుడైన గృహనిర్వాహకుని గూర్చిన ఉపమానం - బోధ (16:1-18).
    c. ధనవంతుడు లాజరును గూర్చిన కథ (16:19-31).
    d. అభ్యంతరాలను గూర్చిన బోధ, నమ్మకమైన విధేయత (17:1-10).

C. యెరూషలేము మార్గం, సమరయ గలిలయలగుండా ప్రయాణం (17:11).
1. పదిమంది కుష్ఠరోగులు (17:11-19).
2. రాజ్యమును గూర్చిన బోధ - మరియు ఆయన రెండవ రాకడ (17:20-37).
3. ప్రార్థనపై ఉపమానాలు:
    a. పట్టువీడని విధవరాలు (18:1-8).
    b. పరిసయ్యుడు, సుంకరి (18:9-14).
4. చిన్న పిల్లలను దీవించడం (18:15-17).
5. ధనవంతుడైన యువ అధికారి - క్రీస్తును వెంబడించువారికి బహుమానం (18:18-30).

**IV.** మనుష్య కుమారుని బలీయమైన మనోభావన (18:31-23:56).

A. చివరి ప్రయాణం (తక్కిన ప్రయాణాలన్నీ దీనివైపే సూచించాయి):
1. తన మరణంకొరకు యెరూషలేము వెళ్లుతున్నట్టు తన శిష్యులకు తెలుపుట (18:31-34).
2. యెరికో వద్ద గుడ్డివానిని బాగుచేయుట (18:35-43).
3. యెరికో వద్ద జక్కయ్య (19:1-10).
4. యెరూషలేము సమీపంలో - మీనాల ఉపమానం (19:11-27).

B. చివరి వారం:
1. ఆదివారం: విజయోత్సాహముతో ప్రవేశం (19:28-40).
2. సోమవారం:
    a. యెరూషలేమును గూర్చి విలపించుట, రూకలు మార్చువారిని తరుముట (19:41-46).
    b. అనుదిన ఉపదేశం, తన శత్రువుల కుట్ర (19:47, 48).
3. మంగళవారం: ప్రశ్నల దినం.

a. “ఏ అధికారముచేత?” (20:1–8).

b. ద్రాక్షాతోట ఉపమానం; తృణీకరింపబడిన రాయిని గూర్చిన బోధ (20:9–19).

c. కైసరునకు పన్ను చెల్లించు ప్రశ్న (20:20–26).

d. పునరుత్థానమును గూర్చిన ప్రశ్న (20:27–39).

e. దావీదు కుమారుని గూర్చిన ప్రశ్న (20:40–44).

f. “శాస్త్రుల విషయమై జాగ్రత్త” (20:45–47).

g. విధవరాలి అర్పణ (21:1–4).

h. దేవాలయము, భవిష్యత్తును గూర్చిన ప్రశ్న (21:5–38).

4. పస్కా దినపు కుట్ర (22:1–6).

5. గురువారం:

a. చివరి రాత్రి భోజనం (22:7–38).

b. గెత్సేమనే తోట (22:39–46).

C. చివరి దినం:

1. అప్పగింపబడుట (22:47–53).
2. ప్రధాన యాజకుని యెదుట తీర్పు (పేతురు బొంకుట) (22:54–65).
3. మహా సభచే తీర్మానించబడుట (22:66–71).
4. పిలాతు ఎదుటికి కొనిపోబడుట (23:1–6).
5. హేరోదు వద్దకు కొనిపోబడుట (23:7–12).
6. పిలాతువద్దకు తేబడుట: “బరబ్బానా లేక యేసునా?” (23:13–25).
7. కల్వరి మార్గములో (23:26–31).
8. యేసు నా కొరకు సిలువ వేయబడ్డాడు (23:32–49)! (మారుమనస్సు పొందిన సిలువపై దొంగ కథ లూకాకు మాత్రమే ప్రత్యేకించినది).
9. అరిమతయియవాడైన యోసేపుచే సమాధి చేయబడడం (23:50–56).

**V.** మనుష్య కుమారుని పరిపూర్ణత (24:1–53). (పునరుత్థానం – యేసు కేవలం నరుడు మాత్రమే కాదనే వాస్తవాన్ని చాటుతుంది; రోమా 1:4 చూడు).

A. ఖాళీ సమాధి.

1. సమాధి వద్దకు వెళ్లిన స్త్రీలు (24:1–11).
2. పేతురు ఖాళీ సమాధి యొద్దకు పరుగెత్తుట (24:12).

B. పునరుత్థాన ప్రత్యక్షతలు:

1. ఎమ్మాయి మార్గంలో యిద్దరు మనుష్యులు (24:13–35).

(ముందుగా వారెరిగిన ప్రేమగల స్నేహితుడిగనే ప్రభువు చూపించబడ్డాడు.)

2. పదకొండు మందికి: సువార్త ప్రకటనను గూర్చిన ఆదేశం - యెరూషలేములో వేచియుండుడని కట్టడ (24:36-49).

C. ఆరోహణం (24:50, 51).

D. యెరూషలేముకు తిరిగి వచ్చిన శిష్యులు వేచియుండుట (24:52, 53). (ఇక్కడ లూకా తన కలం క్రింద పెట్టి కార్యగ్రంథంలో మరలా దాన్ని చేపడతాడు.)

**ముగింపు**

A. యేసు "చేయుటకును బోధించుటకును ఆరంభించిన" వన్నిటితో లూకా సువార్త యిక్కడ ముగించబడుతుంది (అపొ. 1:1).

1. ఆయన బల్ల.
2. ఆయన కన్నీరు.
3. ఆయన శ్రమలు.
4. ఆయన సిలువ.
5. ఆయన సమాధి.
6. ఆయన జయోత్సవం.

B. పరిపూర్ణుడైన మనుష్య కుమారుడు యింకను సజీవుడైయున్నాడు. ఆయన నీకును సహాయము చేయగలవాడైయున్నాడు (హెబ్రీ. 4:15, 16 చూడు).